సాక్షి
ములుగు
సోమవారం । 28 । జులై । 2025



దేశానికే ఆదర్శం.. ముల్కనూరు స్త్రీశక్తి

- 8లో▸

అనతి కాలంలోనే జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ముల్కనూరు స్వకృషి మహిళా డెయిరీ దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది.



వరంగల్‌ను స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దుతాం

వరంగల్‌ను స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు దృఢ సంకల్పంతో ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే నాయిని పేర్కొన్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
31°/24°

వాతావరణం

జిల్లాలో ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ మామూలుగా ఉంటుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేటి ప్రజావాణి రద్దు

ములుగు రూరల్: నేడు కలెక్టరేట్‌లో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ టీఎస్.దివాకర ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భారీ వర్షాలు, వరద నిర్వహణపై ప్రత్యేకాధికారి ఎఫ్‌సీడీఏ కమిషనర్ శశాంక్ జిల్లా పర్యటన ఉందని తెలిపారు. ఐటీడీఏ ఏటూరునాగారంలో ఉన్నతాధికారుల సమీక్ష సమావేశం ఉన్నందున ప్రజావాణి రద్దు చేస్తున్నట్లు తెలిపారు. వచ్చే సోమవారం ప్రజావాణి యధావిధిగా కొనసాగుతుందని వివరించారు.

ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ నిర్మాణానికి నిధులు

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారంలో ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.5కోట్ల నిధులను మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మేడారం సమ్మక్క– సారలమ్మ జాతరలో ప్రతిఏటా ఆర్‌అండ్‌బీశాఖ అధికారులు సేవలందిస్తుంటారు. అధికారుల సౌకర్యార్థం నాలుగు అంతస్తుల గెస్ట్‌హౌస్ నిర్మాణానికి మంత్రి సీతక్క చొరవతో ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. మేడారంలో ఇప్పటికే పంచాయతీరాజ్, రెవెన్యూ గెస్ట్‌హౌస్‌లను నిర్మించారు. వచ్చే ఏడాది మహాజాతర నాటికి ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ కూడా నిర్మించనున్నారు.

రేపు అథ్లెటిక్స్ పోటీలు

ములుగు రూరల్: జిల్లాలోని సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ అథ్లెటిక్స్ పోటీలు రేపు నిర్వహిస్తున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరీ వెంకటేశ్వర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జాకారం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఉదయం 9 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని వెల్లడించారు. ఈ పోటీలలో పాల్గొనదలిచిన వారు జనన ధ్రువీకరణ పత్రాలను తీసుకు రావాలని సూచించారు.

డాక్టర్ శ్రీనివాసరాజుకు పురస్కారం



వాజేడు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలుగు ఉపాధ్యాయుడు, ప్రముఖ రచయిత డాక్టర్ అమ్మిన శ్రీనివాసరాజుకు అమరవాది బాలసాహిత్య పురస్కారం ప్రదానం చేశారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ కసిరెడ్డి, వెంకటరెడ్డి, అమర వాది ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ అమరవాది నీరజలు మోహన్ శ్రీనివాసరాజును శాలువాలో సత్కరించి పురస్కారంగా రూ.5 వేల నగదు అందించారు. మూడు దశాబ్దాలుగా ఆయన సాహిత్యం కోసం చేస్తున్న కృషికి గాను ఈ సత్కారం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సుభద్రాదేవి, లలితాదేవి, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్ఎస్ జెండా ఎగరాలి'

ఏటూరునాగారం: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండా ఎగరాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకుల మర్రి లక్ష్మణ్‌బాబు అన్నారు. ఈ మేరకు జిల్లా నాయకులు ఆదివారం బొట్ల కార్తీక్‌తో పాటు పలువురు మర్యాద పూర్వకంగా లక్ష్మణబాబు కలిశారు. అనంతరం శాలువా కప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రతిఒక్కరూ పాటుపడాలని సూచించారు.

వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుకు ఎంపిక

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు భౌతిక, రసాయన శాస్త్రంలో ప్రతిభ చాటుతున్నారు. భౌతికశాస్త్రంలో దశావధానం, రసాయనశాస్త్రంలో 12మంది విద్యార్థులు 118 మూలకాలను 15 సెకన్ల కాల వ్యవధిలో, అంతకు తక్కువ సమయంలోనే చెప్పడం అబ్బుర పరుస్తుంది. ఈ రెండు అంశాలను ఇటీవల ఫిజికల్‌సైన్స్ ఉపాధ్యాయుడు దొనికల రాజేందర్ 'వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'కు వీడియోలు, ఫొటోలు పంపించారు. ఆ సంస్థ విద్యార్థుల ప్రతిభను చూసి ఎంపిక చేశారు. మంగళవారం ఈ అవార్డుల ప్రదానాన్ని కలెక్టర్ రాహుల్‌శర్మ చేతులమీదుగా కాళేశ్వరం పాఠశాల ఆవరణలో అందజేయనున్నారని పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం రాజేందర్ ఆదివారం తెలిపారు.

పగిడిద్దరాజు గద్దె వద్ద పూజలు చేస్తున్న మంత్రి సీతక్క, యాటతో మొక్కులు చెల్లిస్తున్న భక్తులు





వనదేవతలకు మొక్కులు

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం సమ్మక్క– సారలమ్మలను దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించి పుట్టువెంట్రుకలు సమర్పించుకున్నారు. అమ్మవార్ల గద్దెల వద్ద పసుపు, కుంకుమ, చీరసారె, ఎత్తు బంగారం, కానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. రాష్ట్ర మంత్రి సీతక్క అమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. మొక్కుల అనంతరం భక్తులు మేడారం పరిసరాల్లోని చెట్ల కింద విడిది చేసి వంటావార్పు చేసుకుని సహపంక్తి భోజనాలు చేశారు.

సూర్యభగవానుడి అలంకరణలో దర్శనమిస్తున్న రామలింగేశ్వరస్వామి, దర్శించుకుంటున్న భక్తులు





రామప్పలో సండే సందడి

వెంకటాపురం(ఎం): మండలంలోని చారిత్రక రామప్ప దేవాలయంలో సండే సందడి నెలకొంది. ఆదివారం సెలవుదినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి రామలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ పూజారులు హరీశ్ శర్మ, ఉమాశంకర్‌లు భక్తులకు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేశారు. ఆదివారం సూర్యభగవానుడి అలంకరణలో రామలింగేశ్వరస్వామి పర్యాటకులకు దర్శనమిచ్చాడు.

పంటలకు ప్రాణం..

వర్షాలతో ఆరుతడి, మెట్ట పంటలకు జీవం

- జిల్లాలో 805 చెరువులకు 120 చెరువుల మత్తళ్లు
- వ్యవసాయ పనుల్లో రైతన్న బిజీబిజీ
- ముమ్మరంగా వరినాట్లు



మండల కేంద్రం శివారులో వరినాట్లు వేస్తున్న మహిళలు

వెంకటాపురం(ఎం): వర్షాధారంగా సాగుచేసిన వేలాది ఎకరాల మెట్ట పంటలకు నాలుగు రోజులు కురిసిన వర్షాలు ప్రాణం పోశాయి. దీంతో జిల్లా వ్యాప్తంగా పొలాలన్నీ పచ్చని పైర్లతో కళకళలాడుతున్నాయి. వరుణుడి కరుణతో జిల్లాలో వరినాట్లు సైతం జోరందుకున్నాయి. అన్నదాతలు వ్యవసాయ పనుల్లో బిజీబిజీ అయ్యారు. ప్రస్తుత వానకాలం సీజన్‌లో జిల్లాలో పత్తి 27,143 ఎకరాల్లో సాగు చేయాల్సి ఉండగా ఇప్పటివరకు 22,156 ఎకరాల్లో పత్తిని రైతులు సాగు చేశారు. మొక్కజొన్న 6,009 ఎకరాల్లో సాగు అవుతుందని అధికారులు అంచనా వేయగా ఇప్పటివరకు అంచనాను మించి 8,365 ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేశారు. మిరప పంట 6,900 ఎకరాల్లో సాగు కానుండగా ఇప్పటివరకు రైతులు మిరపనారు పోశారు. గత నాలుగు రోజులుగా కురిసిన వర్షంతో పత్తి పంటకు జీవం పోసినట్లయిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ముమ్మరంగా వరినాట్లు

నాలుగు రోజులుగా కురిసిన వర్షాలతో అన్నదాతలు వరినాట్లపై దృష్టిసారించారు. జిల్లాలో ప్రధానంగా వరిపంటను రైతులు 1,30,117 ఎకరాల్లో వరిసాగు అవుతుందని అధికారులు అంచనా వేయగా ఇప్పటివరకు 17,598 ఎకరాల్లో వరినాట్లు రైతులు వేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు భూముల్లో వర్షపునీరు నిలవడంతో రైతులు పొలాలను సిద్ధం చేసుకొని వరినాట్లు వేస్తున్నారు. గతంతో పోలిస్తే ఈ సారి వరిసాగుపై



వర్షాలతో కళకళలాడుతున్న పత్తిపంట

అన్నదాతలు ప్రధానంగా దృష్టి పెట్టారని అధికారులు వెల్లడిస్తున్నారు.

120 చెరువులు, కుంటలకు మత్తళ్లు

ఇటీవల జిల్లాలో కురిసిన వర్షాలతో 805 చెరువులు, కుంటలు ఉండగా సుమారు 120 చెరువులు, కుంటలు మత్తళ్లు పడినట్లు ఇరిగేషన్ డీఈ రవీందర్ రెడ్డి తెలిపారు. ఎక్కడ కూడా చెరువులు, కుంటలకు గండ్లు పడిన దాఖలాలు లేవని పేర్కొన్నారు. వెంకటాపురం(ఎం) మండల పరిధిలోని రామప్ప చెరువులోకి దేవాదుల నీటిని వారం రోజులుగా రెండు మోటార్ల ద్వారా పంపింగ్ చేస్తున్నట్లు తెలిపారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో పాటు దేవాదుల నీటితో 35 అడుగుల నీటిసామర్థ్యం గల రామప్ప సరస్సు ప్రస్తుతం 25 అడుగులకు చేరినట్లు వివరించారు. రామప్ప సరస్సు నుంచి ధర్మసాగర్ చెరువుకు నీటిని తరలిస్తున్నట్లు వెల్లడించారు.



జలకళను సంతరించుకున్న రామప్ప సరస్సు

వర్షాలు తగ్గాక ఎరువులు వేయాలి



ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు పత్తితో పాటు ఆరుతడి పంటలకు మేలు చేస్తాయి. గతేడాదితో పోలిస్తే ఈసారి వరిసాగు జిల్లాలో పెరగనుంది. ఆగస్టు చివరి వారం వరకు వరినాట్లు వేసుకోవచ్చు. వర్షాలు తగ్గిన తర్వాత పంటలకు ఎరువులు వేయాలి.

– సురేష్‌కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి

కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క

ఎస్ఎస్‌తాడ్వాయి: కాంగ్రెస్ పాలనలోనే పేదలకు తగిన న్యాయం జరుగుతుందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అన్నారు. మండల పరిధిలోని మేడారంలో పార్టీ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్, మండల ఉపాధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు రాపోలు సంజీవరెడ్డిల ఆధ్వర్యంలో ఆదివారం నార్లాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు మంత్రి సీతక్క సమక్షంలో కాంగ్రెస్‌లో చేరగా పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలోనే పేదలకు అన్ని రంగాల్లో న్యాయం జరుగుతుందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు విజయం సాధించేలా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకెళ్లి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. మేడారం జంపన్నవాగు వద్ద టూరిజం పర్యాటకంగా తీర్చిదిద్దుతమని చుట్టూ పక్కల ఉన్న గ్రామాల్లోని యువకులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. పార్టీలో చేరిన వారిలో ఇస్రం దయాకర్, కొడిశాల నవీన్, జీడీ అనిల్, గంధం రమేష్, తాలూకా వెంకన్న, మిరియాల తిరుపతి, దోమల రాజు కుమార్, నాగల్లి కుమార్, కన్నెబోయిన మహేష్, చీమల నితిన్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కల్యాణి, పీఏసీఎస్ చైర్మన్ పులి సంపత్, మాజీ సర్పంచ్ ఇర్ప సునీల్, మాజీ ఎంపీటీసీ బత్తిని రాజు, సీతక్క యువసేన జిల్లా అధ్యక్షుడు చర్ప రవీందర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మేడారంలోని ఊరట్టం స్తూపం వద్ద నూతనంగా నిర్మించిన కాక సారయ్య పెట్రోల్ బంక్ సమ్మక్క– సారలమ్మ కోమలి ఫిల్లింగ్ స్టేషన్‌ను బంక్ యజమాని, సారలమ్మ పూజారి కాక సారయ్య, బంక్ మేనేజర్ శ్రీధర్ కిరణ్‌లతో కలిసి మంత్రి సీతక్క ఆదివారం ప్రారంభించి పలు సూచనలు చేశారు.



పార్టీలో చేరిన వారితో మంత్రి సీతక్క



కూలీలకు కవర్లు అందిస్తున్న సీతక్క

నాటువేసే కూలీలకు 'రెయిన్' కవర్లు

ములుగు రూరల్: వరినాట్లు వేస్తున్న కూలీలకు మంత్రి సీతక్క అందించారు. ఆదివారం తాడ్వాయి మండల పర్యటన అనంతరం తిరిగి వస్తున్న క్రమంలో జిల్లా కేంద్రంలోని లీలా గార్డెన్ సమీపంలో కూలీలు నాట్లు వేస్తుండగా వెళ్లి వారిని ఆప్యాయంగా పలకరించారు. వర్షాకాలంలో ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. అనంతరం కూలీలకు రెయిన్ కవర్లను అందించారు.

లక్నవరంలో బోటు షికారు

గోవిందరావుపేట: ఇటీవల కురిసిన వర్షాలకు లక్నవరం సరస్సు నీటితో కళకళలాడుతోంది. దీంతో సందర్శకుల సంఖ్య పెరుగుతోంది. ఆదివారం సెలవురోజు కావడంతో సందర్శకులు తరలివచ్చారు. ఈసరస్సులో బోటును టూరిజం మేనేజర్ శివశంకర్ ప్రారంభించారు. అనంతరం పలువురు బోటులో షికారు చేసి ఆనందంగా గడిపారు.



లక్నవరంలో బోటును ప్రారంభిస్తున్న టూరిజం మేనేజర్ శివశంకర్

జలపాతాల సందర్శన నిలిపివేత

ములుగు రూరల్: జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జిల్లాలోని జలపాతాల సందర్శనను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు కలెక్టర్ టీఎస్.దివాకర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని బొగత, ముత్యంధార, కొంగల, మామిడిలొద్ది జలపాతాలకు పర్యాటకులు వెళ్లకూడదని సూచించారు. జలపాతాల వద్ద వరద ఉధృతి కారణంగా భద్రత దృష్ట్యా సందర్శనను నిలిపి వేసినట్లు తెలిపారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినంగా వ్యవహరించి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రాజెక్టులు, చెరువుల వద్దకు వెళ్లకూడదని వివరించారు.వర్షాల దృష్ట్యా తక్షణ సహాయం కోసం టోల్ ఫ్రీ నంబర్ 18004257109లో సంప్రదించాలని సూచించారు. కలెక్టరేట్ కంట్రోల్ రూమ్‌లో అధికారులు అందుబాటులో ఉంటారనిని వివరించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు వరద ఉధృతి ఎక్కువైతే వెంటనే పునరావాస కేంద్రాలకు వెళ్లాలని సూచించారు. పర్యాటకులు సహకరించాలని అన్నారు. వరదల కారణంగా ప్రాణనష్టం జరుగకుండా ప్రభుత్వం అన్ని విధాలుగా ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.



కలెక్టర్ దివాకర

జీపీఓ, లైసెన్స్‌డ్ సర్వేయర్ పరీక్షలు ప్రశాంతం

ములుగు రూరల్: జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాలలో గ్రామపాలన అధికారి, లైసెన్స్‌డ్ సర్వేయర్ల పరీక్షలు ప్రశాంతగా ముగిశాయి. ఈ మేరకు ఆదివారం పరీక్ష కేంద్రాన్ని అదనపు కలెక్టర్ మహేందర్‌జీ పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామపాలన అధికారి పరీక్షలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు నిర్వహించగా 27 మంది అభ్యర్థులకు గాను 26 మంది ఒకరు గైర్హాజర్ అయ్యారని తెలిపారు. సర్వేయర్ పరీక్షలు రెండు సెషన్‌లుగా నిర్వహించామని వివరించారు. రాత పరీక్షకు 80 మంది అభ్యర్థులకు గాను 71 మంది అభ్యర్థులు హాజరు కాగా 9 మంది గైర్హాజరయ్యారని వివరించారు. మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా పోలీసు బందోబస్తు మధ్య పకడ్బందీగా పరీక్షలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ రాజ్‌కుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తుల రవి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.




పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న మహేందర్‌జీ

దేవాదులలో పంపింగ్ నిలిపివేత

కన్నాయిగూడెం: ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని దేవాదుల జె.చొక్కారావు ఎత్తిపోతల ప్రాజెక్టు ఫేజ్ త్రీలోని నాలుగు మోటార్ల పంపింగ్‌ను అధికారులు ఆదివారం నిలిపివేశారు. కొన్ని రోజుల నుంచి పంపింగ్ వద్ద మూడు ఫేజ్‌ల్లో 10 మోటార్లు ఉండగా అందులో ఫేజ్ త్రీలో నాలుగు మోటార్లు, ఫేజ్ టూలో రెండు మోటార్లను ఆన్ చేసి, ఆరు మోటార్లతో పంపింగ్‌ను అధికారులు కొనసాగించారు. ఫేజ్ త్రీలోని నాలుగు మోటార్లను ఆఫ్‌చేసి ఫేజ్ టూలోని రెండు మోటార్లతో 494 క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న గొల్లబుద్దారాపు రిజర్వాయర్‌లోకి ఎత్తిపోస్తున్నట్లు దేవాదుల డీఈ శరత్‌బాబు తెలిపారు. ప్రస్తుతం పంపింగ్ వద్ద 80.85 మీటర్ల నీటిమట్టం కొనసాగుతోంది.

సమ్మక్క సాగర్ గేట్ల ఎత్తివేత..

సమ్మక్క సాగర్ బ్యారేజీలోకి భారీగా వరద నీరు చేరుతుండడంతో నిండుకుండను తలపిస్తోంది. ఎగువ నుంచి 6,05,340 క్యూసెక్కుల నీరు చేరుతుండడంతో బ్యారేజీ వద్ద ఉన్న 59 గేట్లను ఎత్తి 6,04,846 క్యూసెక్కుల నీటిని దిగువకు పంపిస్తున్నారు. బ్యారేజీ వద్ద 83 మీటర్లకు 80.20 మీటర్ల నీటి మట్టం కొనసాగుతోంది.



దేవాదుల మోటార్లు

సింగరేణి ప్రైవేటీకరణకు కుట్ర



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



జిల్లాకేంద్రంలో కేటీఆర్‌కు గజమాలతో స్వాగతం పలుకుతున్న నాయకులు, కార్యకర్తలు

- గురుకులాలను గాలికొదిలిన ప్రభుత్వం
- జిల్లాకో లీగల్ సెల్ ఏర్పాటు చేస్తాం.. కేసులకు జంకొద్దు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు
- జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పర్యటన

భూపాలపల్లి/భూపాలపల్లి అర్బన్/మొగుళ్లపల్లి: పేద విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలనే ఉద్దేశంతో మాజీ సీఎం కేసీఆర్ ఏర్పాటు చేసిన గురుకులాలను కాంగ్రెస్ ప్రభుత్వం గాలికి వదిలేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు ఆరోపించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మొగుళ్లపల్లి మండలం ఇస్సిపేట గ్రామంలో మాజీ సర్పంచ్ కొడారి కొమురయ్య విగ్రహాన్ని కేటీఆర్ ఆవిష్కరించి రైతు కూలీలతో మాట్లాడారు. అనంతరం మొగుళ్లపల్లి మండల కేంద్రం, జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశాల్లో కేటీఆర్ మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులు ప్రతీ గురుకులాన్ని సందర్శించి అక్కడి సమస్యలపై పోరాటం చేసి ప్రభుత్వాన్ని మేల్కొల్పాలని పిలుపునిచ్చారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కలిసి సింగరేణి సంస్థను ప్రైవేటీకరణ చేసేందుకు కుట్ర పన్నుతున్నాయని, వచ్చే సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో బీఆర్ఎస్ అనుబంధ టీబీజీకేఎస్‌ను గెలిపించాలని కార్మికులను కోరారు. కాంగ్రెస్ ఆగడాలను ప్రశ్నిస్తున్న తమ పార్టీ నాయకులపై పోలీసులు అక్రమంగా కేసులు బనాయిస్తున్నారని, ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు. త్వరలోనే జిల్లాకో పార్టీ లీగల్ సెల్ ఏర్పాటు చేసి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. రాష్ట్రంలో 3,400 పల్లెలను జీపీలుగా, జిల్లాకో వైద్య కళాశాల ఏర్పాటు చేసిన ఘనత తమకే దక్కిందన్నారు. బీఆర్ఎస్ హయాంలో చేసి నవాటిని చెప్పుకోవడంలో విఫలం అయినందునే ఎన్నికల్లో ఓటమి పాలయ్యామన్నారు. మరోమారు అలా జరుగకుండా కాంగ్రెస్ చేస్తున్న మోసాలను ప్రతీ గ్రామంలో ఇంటింటికి తెలుపాలని సూచించారు.

గండ్రకే ఎమ్మెల్యే టికెట్...

తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్‌కు సోదరుడిగా ఉన్న సిరికొండ మధుసూదనాచారికి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత శాసన సభాపతి పదవి ఇచ్చారన్నారు. అంతేకాకుండా కేబినెట్ హోదాకు సమానమైన శాసన మండలి ప్రతిపక్ష నేత పదవి ఇచ్చారన్నారు. భూపాలపల్లి నియోజకవర్గ బాధ్యతలు మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి చూసుకుంటారని, ఆయనకే టికెట్ అని ఇందులో ఎటువంటి అనుమానం లేదన్నారు. గండ్ర నాయకత్వంలో అందరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై పోలీసులు అక్రమ కేసులు బనాయిస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. గోరీల మీద మాదిరిగా ఇక్కడి ఎమ్మెల్యే శిలాఫలకాలపై ఫొటోలు వేయించుకుంటున్నాడని అన్నారు. తాను భూకబ్జా చేశానని ఆరోపిస్తున్న ఎమ్మెల్యే ఎందుకు నిరూపించడం లేదని ప్రశ్నించారు. మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి సత్యవతిరాథోడ్, మాజీ ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, పెద్ది సుదర్శన్‌రెడ్డి, దివ్యాంగుల అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వాసుదేవరెడ్డి, స్థానిక నాయకులు కటకం జనార్దన్, గొర్రె సాగర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

6నుంచి డీసీఏ పరీక్షలు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని దూరవిద్యలో డిప్లొమా ఇన్ కంప్యూటర్ అప్లికేషన్స్ పరీక్షలు ఆగస్టు 6వ తేదీనుంచి నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కె.రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ పద్మజ ఆదివారం తెలిపారు. ఆయా విద్యార్థులకు ప్రయోగ పరీక్షలు ఆగస్టు 21వ తేదీనుంచి ఉంటాయని, పీజీడీసీఏ మొదటి సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తామని వివరించారు. లైబ్రరీ సైన్స్ ఇయర్ వైజ్ ఎక్స్ విద్యార్థులకు సైతం ఆగస్టు 6వతేదీ నుంచి పరీక్షలు ఉంటాయని వారు తెలిపారు. పూర్తివివరాలు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని సూచించారు.

కుక్కల దాడిలో 12గొర్రెలు మృతి


కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రెలు

లింగాలఘణపురం : మండలంలోని జీడికల్ గ్రామంలో శనివారం రాత్రి కొండబోయిన రాములుకు చెందిన గొర్రెల పాకపై కుక్కలు దాడి చేసి 12 గొర్రెలను చంపివేశాయి. రాములు రోజు మాదిరిగానే గొర్రెలను మేపి వ్యవసాయ బావి వద్ద ఉన్న పాకలో వదిలాడు. ఆదివారం ఉదయం వెళ్లి చూసే సరికి 12గొర్రెలు మృతిచెంది ఉన్నాయి. సమీపంలోని రామచంద్రగూడెనికి చెందిన కుక్కలు వచ్చి దాడి చేసి ఉంటాయని గ్రామస్తులు తెలిపారు. సుమారు రూ.లక్ష వరకు నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు రాములు వేడుకుంటున్నాడు.

వాగు దాటుతూ గుంతలో పడి రైతు..


బాలు(ఫైల్)

గూడూరు : పొలం పనులు ముగించుకొని ఇంటికి వస్తున్న ఓ రైతు సమీప రాళ్ల వాగును దాటుతూ నీటి గుంతలో పడి మృతి చెందిన సంఘటన మండలంలోని కోబల్‌తండాలో ఆదివారం వెలుగు చూసింది. మృతుడి బంధువులు, పోలీసుల కథనం ప్రకారం.. తండాకు చెందిన బానోత్ బాలు నాయక్ (50) శనివారం తండా సమీపంలోని రాళ్లవాగు అవతలి వైపు పొలం వద్దకు వెళ్లాడు. సాయంత్రం తిరిగి వస్తుండగా రాళ్ల వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. వాగు దాటే ప్రయత్నంలో పొక్లెయినర్ తీసిన గుంతలో పడి బాలు నాయక్ మునిగిపోయాడు. రాత్రి అయినా ఇంటికి రాలేదని వాగు ఒడ్డున గాలించగా, తెల్లవారుజామున మూడుగంటల ప్రాంతంలో మృతి చెంది కనిపించాడు. మృతుడి భార్య బుజ్జి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై గిరిధర్‌రెడ్డి తెలిపారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తి..


రామచంద్రం (ఫైల్)

సంగెం : బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొట్టిన ఘటనలో రైతుకు తీవ్రగాయాలై మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని కుంటపల్లి గ్రామానికి చెందిన రైతు రౌతు రామచంద్రం (58) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రామచంద్రం కూలీల కోసం చింతలపల్లికి వెళ్లాడు. తిరిగి వస్తున్న క్రమంలో చింతలపల్లి బస్టాండ్ మూలమలుపు వద్దకు రాగానే స్కూటీ అదుపు తప్పి రోడ్డు పక్కన చెట్టును ఢీకొట్టాడు. ఈ ఘటనలో రామచంద్రం తలకు తీవ్రమైన గాయమైంది. స్థానికుల సమాచారంతో అతడి కుమారుడు రాకేష్ 108 ద్వారా ఎంజీఎంకు తరలించగా పరీక్షించిన వైద్యులు రామచంద్రం మృతి చెందినట్లు తెలిపారు. రామచంద్రంకు భార్య అరుణ, కూతురు జానకి, కుమారుడు ఉన్నారు. మృతుని కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎస్సై డి.రాజు తెలిపారు.

దేశానికే ఆదర్శం.. ముల్కనూరు స్త్రీశక్తి

మహిళల ఆర్థిక స్థిరత్వానికి నిదర్శనం ముల్కనూరు డెయిరీ
- 2,300 మంది సభ్యులు, 80వేల లీటర్ల పాల సేకరణ
- రూ.200కోట్ల వ్యాపారం
- రెండు సార్లు జాతీయ స్థాయి అవార్డులు


పాలను సేకరిస్తున్న మహిళలు

ఎల్కతుర్తి : కరువు కాలంలో ముల్కనూరు సహకార గ్రామీణ బ్యాంక్ తోడ్పాటుతో జాతీయ పాడిపరిశ్రమ అభివృద్ధి సంస్థ ముల్కనూరులో డెయిరీని ఏర్పాటు చేశారు. మహిళల స్వయం కృషితో ఎదగాలనే ఆకాంక్షతో ముల్కనూర్‌లో కోఆపరేటివ్ గ్రామీణ బ్యాంకు సహకారంతో 2002లో స్వయం కృషి మహిళా సహకార డెయిరీని స్థాపించారు. నాణ్యమైన పాలను సరఫరా చేస్తూ అనతి కాలంలోనే నాలుగు జిల్లాల్లో వ్యాపారాన్ని విస్తరించి, నేడు 203 సంఘాలతో 23,045 మంది మహిళా సభ్యులు, 80వేల లీటర్ల పాలను సేకరిస్తున్నారు. ప్రతీ ఏటా రూ.200కోట్ల వ్యాపారం చేస్తూ జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. ఇందుకు గాను రెండు సార్లు జాతీయ స్థాయిలో డెయిరీ అవార్డులు అందుకున్నారు. ఎన్‌డీబీ సహకారంతో రూ.12కోట్లతో కొత్త ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకొని వ్యాపారాన్ని మరింత అభివృద్ధి చేస్తున్నారు.


తయారు చేసిన స్వీట్స్‌ను ప్యాక్ చేస్తున్న మహిళలు


ముల్కనూరు డెయిరీని సందర్శించిన విదేశీయులు (ఫైల్)

నేడు స్వకృషి మహిళా డెయిరీ 23వ మహాసభ

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూరు డెయిరీ కేంద్రంగా మహిళలు వివిధ ప్రాంతాల నుంచి పాలను సేకరిస్తున్నారు. సేకరించిన పాలనను యంత్రాల ద్వారా శుద్ధి చేసిన అనంతరం వాటిని ప్యాకెట్లులో నింపి సరఫరా చేస్తున్నారు. ఇక్కడికి వచ్చే పాలతో నెయ్యి, స్వీట్లు, పెరుగు, మజ్జిక, లస్సీ వంటి పదార్థాలు తయారు చేస్తారు. వీటిని రాష్ట్రంతో పాటు వివిధ రాష్ట్రాలకు, దేశ, విదేశాలకు సైతం మార్కెటింగ్ చేస్తూ ముల్కనూర్ మహిళా పాల డెయిరీ అంటే ఒక ఉమెన్ బ్రాండ్ అనేలా కితాబులందుకున్నారు. కాగా నేడు డెయిరీ ప్రధాన కార్యాలయంలో ముల్కనూర్ స్వకృషి మహిళా డెయిరీ 23వ మహాసభ నిర్వహించనున్నట్లు అధ్యక్షురాలు బుర్ర ధనశ్రీ, జీఎం భాస్కర్‌రెడ్డి తెలిపారు.

ఆజంజాహిని మరిపించేలా టెక్స్‌టైల్ పార్కు


పరకాలలో బాలింతలకు కేసీఆర్ కిట్లను పంపిణీ చేసిన కేటీఆర్, చిత్రంలో మాజీ ఎమ్మెల్యేలు

- పరకాల దోపిడీపై రేవంత్‌ను నిలదీస్తా..
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ఆత్మకూరు : చేనేత కార్మికులు, పద్మశాలీలకు ఉపాధి కల్పించిన వరంగల్‌లోని ఆజంజాహి మిల్లును సమైక్య పాలనలో మూసివేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు పేర్కొన్నారు. దీంతో నేత కార్మికులు, పద్మశాలీలు సూరత్, భీవండికి వలస వెళ్లారని తెలిపారు. ఆజంజాహి మిల్లును మరిపించే విధంగా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 1,400 ఎకరాల్లో మెగా టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేసినట్లు వివరించారు. గిఫ్ట్ ఏ స్మైల్‌లో భాగంగా కుట్టుశిక్షణ పొందిన పరకాల, నడికూడ మండలాలకు చెందిన 500 మంది మహిళలకు ఆదివారం పరకాలలో కేటీఆర్ కుట్టుమిషన్లు, 100 మందికి కేసీఆర్ కిట్లను పంపిణీ చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి మహిళలకు శిక్షణ ఇప్పించి కుట్టుమిషన్లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. తాము కష్టపడి ఏర్పాటు చేసిన పార్కులో కాంగ్రెస్ వాళ్లు వడ్డించిన విస్తరి ఎదుట కూర్చొని తమ వాళ్లకు ఉద్యోగాలు ఇస్తామని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. జిల్లా మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలది దండుపాలెం బ్యాచ్ అని ఎద్దేవా చేశారు. ప్రశ్నించకుంటే దోపిడీ ఆగదన్నారు. బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ మోసాలు సాగవని హెచ్చరించారు. ఇందిరమ్మ, సోనియమ్మ, రేవంత్ బిడ్డ పేరు పెట్టుకున్నా ఫర్వాలేదు.. లబ్ధిదారులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పరకాల దోపిడీపై రేవంత్ రెడ్డిని గల్లా పట్టి నిలదీస్తానని ఘాటు వ్యాఖ్యలు చేశారు. అనంతరం పరకాల మండలం లక్ష్మీపురంలో కేటీఆర్ బీఆర్ఎస్ జెండాను ఆవిష్కరించి, నాగారంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బండా ప్రకాశ్, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, నన్నపునేని నరేందర్, తాటికొండ రాజయ్య, గండ్ర వెంకటరమణారెడ్డి, శంకర్‌నాయక్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, నాగుర్ల వెంకటేశ్వర్‌రావు, పెద్ది స్వప్న, గండ్ర జ్యోతి, రాకేశ్ రెడ్డి, శోభన్‌కుమార్, సారంగపాణి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకన్న, సంజీవరెడ్డి, కుమారస్వామి, రవియాదవ్, జాకీర్, రాము తదితరులు పాల్గొన్నారు.

జర్నలిజంలో విలువలు పాటించాలి

- మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి


మాట్లాడుతున్న మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

ఖిలా వరంగల్ : జర్నలిజంలో విలేకరులు సామాజిక బాధ్యత, విలువలను మాత్రమే పాటించాలని, తద్వారా సమాజంలో ప్రజాదరణ పొందుతామని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. వరంగల్‌లోని తాళ్ల పద్మావతి ఇంటర్నేషనల్ స్కూల్ ప్రాంగణంలో వరంగల్ జిల్లా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు రెండ్రోజుల పాటు జరుగనున్న శిక్షణ తరగతులు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీనివాస్ రెడ్డి హాజరై నైతిక నియమాలు–మీడియా చట్టాలు అనే అంశంపై తొలిరోజు శిక్షణ తరగతులను ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుతం డిజిటల్ మీడియా రంగంలో వేగంగా వార్తల సేకరణ సులభమవుతోందని సూచించారు. జర్నలిస్టులు నైతిక ప్రమాణాలు పాటించాలన్నారు. ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆవిర్భావం, వర్కింగ్ జర్నలిస్ట్..నాన్ వర్కింగ్ జర్నలిస్టులు తదితర అంశాలపై ఆయన విపులంగా వివరించారు. భవిష్యత్‌లో పత్రిక నిర్వహణలో ఏఐ ప్రధాన పాత్ర పోషించబోతుందని, తదనుగుణంగా రాబోయే కాలంలో జర్నలిస్టులకు టెక్నాలజీ, ఫ్యాక్ట్ చెక్ వంటి టెక్నికల్ అంశాలతో కూడిన తరగతులను మీడియా అకాడమీ తరఫున నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రముఖ సంపాదకుడు కె.శ్రీనివాస్, జర్నలిస్టులు చిల్ల మల్లేశం, దిలీప్‌రెడ్డి, మీడియా అకాడమీ కార్యదర్శి వెంకటేశ్వరరావు, టీయూడబ్ల్యూజే (ఐజేయూ) అధ్యక్షుడు శ్రీరాం రాంచందర్, ప్రధాన కార్యదర్శి మట్ట దుర్గాప్రసాద్, తాళ్ల పద్మావతి విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ అరుణ్, డీపీఆర్ఓ ఆయూబ్ అలీ, జర్నలిస్టులు పాల్గొన్నారు

వరంగల్‌ను స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దుతాం

- పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- ముగిసిన రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు


విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వరంగల్ స్పోర్ట్స్ : వరంగల్‌ను స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ధృడసంకల్పంతో ముందుకు సాగుతున్నామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మహబూబాబాద్ జిల్లా అమ్యోచూర్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యోనెక్స్ సన్‌రైజ్ 11వ తెలంగాణ రాష్ట్ర స్థాయి అండర్–17 బాలబాలికల షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ముగిశాయి. ఆదివారం ముగింపు పోటీల వేడుకలు హనుమకొండ సుబేదారిలోని వరంగల్ క్లబ్ వేదికగా జరిగాయి.ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి హాజరై విజేతలకు ట్రోఫీ, పతకాలు, సర్టిఫికెట్లను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..విద్య, వైద్యరంగాల్లో అభివృద్ధి చెందుతున్న వరంగల్ మహానగరాన్ని ఇప్పుడు క్రీడా రంగంలోనూ తీర్చిదిద్దేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. నగర శివారులో స్పోర్ట్స్ స్కూల్‌తో పాటు క్రికెట్ స్టేడియం నిర్మాణానికి కావాల్సిన నిధులను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. మహబూబాబాద్ బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ మూల జితేందర్‌రెడ్డి, కొమ్ము రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ..మూడ్రోజుల పాటు నిర్వహించిన పోటీల్లో రాష్ట్రంలోని 20 జిల్లాల నుంచి 250 మంది క్రీడాకారులు, కోచ్, మేనేజర్లు పాల్గొన్నారని తెలిపారు. గెలుపొందిన క్రీడాకారులు డిసెంబర్ మొదటి వారంలో భువనేశ్వర్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. ఈ కార్యక్రమంలో శ్రీసాయిహర్షిత్, అంకిత్‌కుమార్, డీసీపీ పుల్లా శోభన్‌కుమార్, బ్యాడ్మింటన్ క్రీడాకారుడు సీఎం శశిధర్, వరంగల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.రమేష్‌కుమార్, కార్యదర్శి డాక్టర్ పింగిళి రమేష్‌రెడ్డి, కోశాధికారి నాగకిషన్, వద్దిరాజు వెంకటేశ్వర్లు, మనోజ్‌రావు, టోర్నమెంట్ పరిశీలకుడు బాబు, విజయ్, అమరలింగేశ్వర్‌రావు, కిరణ్, హనుమంతరావు పాల్గొన్నారు.

విజేతలు..

బాలుర సింగిల్స్ విభాగంలో శశాంక్ వనమాల (నల్లగొండ) గెలుపొందాడు. బాలికల సింగిల్స్ విభాగంలో సరయు సూర్యనేని (హైదరాబాద్) విజేతగా నిలిచింది. బాలికల డబుల్స్ కేటగిరీలో శ్రీదేవికా ఆదిష్య (సంగారెడ్డి), వై.శృతి(సంగారెడ్డి) జట్టు విజయం సాధించింది. బాలుర డబుల్స్ కేటగిరీలో బూడిద తనీష్‌రెడ్డి(రంగారెడ్డి), తన్మయినిహాల్ ఉత్తమ్ (కరీంనగర్) జోడీ గెలుపొందింది.మిక్స్‌డ్ డబుల్స్‌లో మిక్స్‌డ్ డబుల్స్ కేటగిరీలో ఎస్.అఖిలేష్ గౌడ్ (నల్లగొండ), బి.రిత్విక్‌శ్రీ (భద్రాద్రి కొత్తగూడెం) జట్టు విజేతగా నిలిచింది.

రూ.150 కోట్లతో మేడారంలో శాశ్వత పనులు

- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క
- జాతర ఏర్పాట్లపై మేడారంలో అధికారులతో సమీక్ష


సమ్మక్క గద్దె వద్ద పూజలు చేస్తున్న మంత్రి సీతక్క

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం సమ్మక్క– సారలమ్మ మహా జాతరలో రూ.150 కోట్లతో శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. ఆదివారం ములుగు జిల్లా మేడారంలోని ఐటీడీఏ అతిథి గృహంలో జాతర ఏర్పాట్లపై మంత్రి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతరలో తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, రోడ్ల మరమ్మతులకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రత్యేక నిధులు కేటాయించిందని వివరించారు. ఆసియాలోనే ప్రసిద్ధి చెందిన మేడారం సమ్మక్క–సారలమ్మ జాతరకు వచ్చే కోట్లాది మంది భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు వేసిందని తెలిపారు. జాతర సమయంలో భక్తులు, వీఐపీలు బస చేయడానికి వీలుగా మేడారంలో గెస్ట్‌హౌస్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. పస్రా, నార్లాపూర్, తాడ్వాయి ప్రధాన జంక్షన్‌లో అమ్మవార్ల ప్రతిరూపాలు ఏర్పాటు చేస్తామని, రూ.15 కోట్లతో రోడ్డు విస్తరించనున్నట్లు తెలిపారు. జంపన్నవాగు ఉధృతిని మంత్రి సీతక్క పరిశీలించారు. అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కల్యాణి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవీందర్, జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్, పీఏసీఎస్ చైర్మన్ పులి సంపత్, పూజారులు చందా రఘుపతి, కాక సారయ్య, కాక వెంకటేశ్వర్లు, భోజరావు, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎఫ్ఐ జాయింట్ సెక్రటరీగా పవన్‌కుమార్


పవన్‌కుమార్‌ను సత్కరిస్తున్న హెచ్ఎఫ్ఐ బాధ్యులు

వరంగల్ స్పోర్ట్స్: హ్యాండ్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (హెచ్ఎఫ్ఐ) జాయింట్ సెక్రటరీగా హనుమకొండ వడ్డేపల్లికి చెందిన తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్ ఎన్నికయ్యారు. ఆదివారం న్యూఢిల్లీలోని కాన్స్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియాలో 54వ హెచ్ఎఫ్ఐ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన ఎన్నికల్లో పవన్‌కుమార్ జాయింట్ సెక్రటరీగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి రాధేశ్యాంశర్మ ఓ ప్రకటనలో తెలిపారు. మూడు సంవత్సరాల పాటు పవన్ ఈ పదవిలో కొనసాగుతారని పేర్కొన్నారు.

ఉరేసుకొని ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్య

ఆత్మకూరు : ఉరేసుకొని ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని అగ్రంపహాడ్‌లో ఆదివారం చోటుచేసుకుంది. సీఐ సంతోష్ కథనం ప్రకారం.. అగ్రంపహాడ్ గ్రామానికి చెందిన కంచరకుంట్ల మైపాల్‌రెడ్డి (49) ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా కుటుంబంలో కలహాలతోపాటు ఇటీవల నర్సంపేటలో తనపై నమోదైన కేసు వల్ల మనస్తాపానికి గురయ్యాడు. ఆదివారం ఇంట్లో ఎవరు లేని సమయంలో చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి మల్లారెడ్డి ఫిర్యాదు మేరకు సీఐ సంతోష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రైలు కింద పడి వ్యక్తి ..

ఖిలా వరంగల్ : జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదివారం వరంగల్ పాత రైల్వే గేట్ సమీపంలో రైల్వే ట్రాక్‌పై చోటు చేసుకుంది. జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ రాజు కథనం ప్రకారం.. ఆదివారం సాయంత్రం ఖిలా వరంగల్ ప్రాంతానికి చెందిన మట్టెవాడ రమేశ్ (48) జీవితంపై విరక్తి చెంది కాజీపేట–వరంగల్ రైల్వేస్టేషన్ మధ్య గల ట్రాక్‌పై గూడ్స్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి వద్ద లభించిన ఫోన్ నంబర్ ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించి మృతదేహాన్ని ఎంజీఎం ఆస్పత్రి మార్చురీలో భద్రపర్చినట్లు హెడ్‌కానిస్టేబుల్ రాజు తెలిపారు.

మావోయిస్టులకు వ్యతిరేకంగా వాల్‌పోస్టర్లు


గ్రామంలో వెలసిన పోస్టర్లు

పలిమెల : మండలంలోని సర్వాయిపేట, దమ్మూరు, నీలంపల్లి, ముకునూరు, బూరుగుగూడెం గ్రామాల్లో మావోయిస్టులకు వ్యతిరేకంగా మావోయిస్టు ఆత్మ పరిరక్షణ ప్రజాఫ్రంట్, తెలంగాణ పేరుతో ఆదివారం వాల్‌పోస్టర్లు వెలిశాయి. ఇందులో 'సిద్ధాంతం కోసం అడవి పాలైన అన్నల్లారా, అక్కల్లారా..! మీరు నమ్మిన సిద్ధాంతం సామాన్యుడికి ఆకాకిరణం ఎన్నడైంది..? మీకు ఎదురైన సవాళ్లు, తద్వారా వచ్చే పరిణామాలు విశ్లేషిస్తే మీకు ఆత్మ సంతృప్తిని మిగిల్చిందేంటని ప్రశ్నించారు. ఆత్మ సంతృప్తి లేని ఆత్మ గౌరవంతో ముందుకు పోతున్న మీ 40 ఏండ్ల నాటి ఉద్యమ బాట ప్రజాదరణ లేక బీడు భూమిలాగా అయ్యిందని పేర్కొన్నారు. మావోయిస్టు అగ్ర నాయకుల్లారా..! ఇకనైనా మీ కాలం చెల్లిన సిద్ధాంతాన్ని వీడి, కాలానుగుణంగా మారిన ప్రజా జీవన విధానంలో పాత్రులు కావాలని కోరారు. ఆయుధాలు వీడండి –జనజీవన స్రవంతిలోకి రండి..! మీ మేథస్సును ప్రజల అభివృద్ధికి ఉపయోగించండి' అంటూ పోస్టర్లలో పేర్కొన్నారు.

చెన్నైనుంచి క్రేన్ తెప్పించి.. 3 గంటలు రైళ్లు నిలిపి

- ఉప్పల్‌లో ఆర్వోబీపై గడ్డర్లు అమర్చే పనులు ప్రారంభం


భారీ క్రేన్ సాయంతో ఆర్వోబీపై గడ్డర్లు అమరుస్తున్న అధికారులు

కమలాపూర్: హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని ఉప్పల్‌లో చేపట్టిన ఆర్వోబీపై గడ్డర్లు అమర్చే పనులను రైల్వే అధికారులు ఆదివారం ఎట్టకేలకు ప్రారంభించారు. పెద్దపల్లిలో ఆర్వోబీపై గడ్డర్లు అమర్చే సమయంలో తలెత్తిన సమస్యను దృష్టిలో పెట్టుకుని ఈసారి ఎలాంటి పొరపాట్లు జరుగకుండా రైల్వే అధికారులు జాగ్రత్త పడ్డారు. ఈ మేరకు చెన్నై నుంచి ఓ భారీ క్రేన్‌ను తెప్పించి, అందుబాటులో ఉన్న మరో క్రేన్ సాయంతో గడ్డర్లు అమర్చే పనులు చేపట్టారు. ఇందుకోసం రైల్వే శాఖ నుంచి 3 గంటల పాటు బ్లాక్ తీసుకుని రైళ్లను నిలిపివేశారు. సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను మాత్రం ఉప్పల్‌లో నెమ్మదిగా పోనిచ్చారు. కాగా ఆర్వోబీపై గడ్డర్లు అమరుస్తున్న కారణంగా రైల్వే గేట్ మూసి వేయడంతో హుజూరాబాద్–పరకాల మార్గంలో నడిచే బస్సులను ఆర్టీసీ అధికారులు ఉప్పల్ గేట్ వరకే నడిపించారు.

పరిశోధనలు మానవాళి మనుగడకు దోహదం

- సామాజిక వేత్త డాక్టర్ అశోక్


ప్రశంస పత్రాలు అందుకున్న విద్యార్థులతో అతిథులు

కాజీపేట రూరల్ : మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా, రాష్ట్రపతిగా ఎదిగిన మహనీయుడు అబ్దుల్ కలాం అని, మనం చేసే పరిశోధన ఫలితాలు సగటు మానవాళి ప్రగతికి ఉపయోగపడాలని ఆకాంక్షించిన గొప్ప మేధావి కలాం అని సామాజిక వేత్త డాక్టర్ పరికిపండ్ల అశోక్, రామలింగారెడ్డి పేర్కొన్నారు. మాజీ రాష్ట్రపతి, భారతరత్న అబ్దుల్ కలాం వర్ధంతిని పురస్కరించుకుని లీడ్ ఫౌండేషన్ గ్లోబల్, ఆరోగ్యమిత్ర, లిబర్టీ ఫౌండేషన్ సహకారంతో నివాసయోగ్యమైన భూగోళ పరిరక్షణ అనే అంశంపై కాజీపేట ఫాతిమానగర్ బాలవికాస సెంటర్‌లో ఆదివారం రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించారు. డాక్టర్ అశోక్ అధ్యక్షతన వివిధ రంగాల మేధావులు పాల్గొని విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా బాలవికాస ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శౌరిరెడ్డి, నెహ్రూ యువకేంద్రం కోఆర్డినేటర్ అన్వేష్, వందేమాతరం ఫౌండేషన్ రవీందర్‌రావు, జనవిజ్ఞాన వేదిక బాధ్యుడు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ అబ్దుల్ కలాం దివ్యాంగుల కోసం రూపొందించిన కాలిపర్స్, తక్కువ ఖర్చుతో తయారు చేసిన గుండెకు వేసే స్టంట్లు సగటు మానవుడికి ఉపయోగపడేలా ఉన్నాయని వివరించారు. రాకెట్ ప్రయోగాల్లో భారతదేశాన్ని అగ్రరాజ్యాల సరసన నిలబెట్టిన ఘనత కలాందే అని కొనియాడారు. ఉమ్మడి జిల్లాలో నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు, ప్రశంసపత్రాలు అతిథుల చేతుల మీదుగా అందజేశారు. 18 మంది సామాజిక సేవకులకు వింగ్స్ ఆఫ్ ఫైర్–2025 అవార్డులను అందజేశారు. వ్యాసరచన పోటీల ఉమ్మడి జిల్లాల కన్వీనర్లు వెనుగంటి శుభ, డాక్టర్ ఆడెపు రాజేంద్రప్రసాద్, పిట్ట సత్యం, కుసుమ కృష్ణమోహన్, మమత, వారణాసి, మోహన్, మంజుల, భిక్షపతి, అటవీ జిల్లా విశ్రాంత అధికారి పురుషోత్తం, ఎమర్జెన్సీ మెడిసిన్ డాక్టర్ చిలుకమారి గోపినాథ్, డాక్టర్ మాలోత్ రవీంద్రనాయక్, తాళ్ల సమ్మయ్య, దర్శిని, అన్నం ఫౌండేషన్ శ్రీనివాస్ ఉమ్మడి జిల్లా విద్యార్థులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

భీమునిపాద జలపాతంలో పర్యాటకుల సందడి


జలపాతంలో స్నానాలు చేస్తున్న పర్యాటకులు

గూడూరు : మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం సీతానగరం శివారు కొమ్ములవంచ సమీపంలోని భీమునిపాద జలపాతంలో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు భీమునిపాద జలపాతం కనువిందు చేస్తోంది. ఆదివారం సెలవు రోజు కావడంతో ఉమ్మడి వరంగల్, మహబూబాబాద్ జిల్లా నుంచి కార్లు, ఆటోలు, బస్సుల్లో పర్యాటకులు జలపాతం వద్దకు చేరుకున్నారు. పర్యాటక కేంద్రమైన భీమునిపాద జలపాత ప్రాంతంలో అటవీ శాఖ ఇటీవల వసతులు, కాటేజీలు నిర్మించారు.కనువిందు చేస్తున్న జలపాతాన్ని తిలకిస్తూ, స్నానమాచరిస్తు పర్యాటకులు కేరింతలతో సందడి చేశారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

- హౌస్ మార్టిగేజ్, ఓపెన్ ప్లాట్స్, రేకులు & గూనపెంకు ఇళ్లపై ప్రైవేట్ ఫైనాన్స్ ఇప్పించబడును. HNK. సెల్: 8096520976. [WA-6752]

WANTED

- WGL భవాని ఖార గొర్రెకుంటలో పని చేయుటకు లైన్ సేల్స్‌మేన్స్ కావలెను. ఫోన్ కాల్ టైమింగ్స్ 11AM to 6PM. Cell: 9396991649. [SCA25006616]
- స్వామి వివేకానంద ఓల్డేజ్ హోం (VJA) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు 10th ఆపై చదివి, Age: 20-30 కలిగిన (M/F) వర్కర్లు కావలెను. భో+వ+జీ: 18-20 వేలు. ఏజెంట్ల కమీషన్: 5000 ✆ 9959021122, 9959031122 [B-1275594]
- త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి ఫుడ్ జీ : 18K. Ph: 9848571888, 9640400073 [SCA25006687]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ॥ 260/- అదనపు లైను రూ॥ 60/- మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

వరంగల్	9705748198
నర్సంపేట	9553955722
జనగామ	9951602871
మహబూబాబాద్	9010144453
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వారా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.